# గాలివాన

శ్రీ పాలగుమ్మి పద్మరాజు



శ్రీ పద్మరాజు

ప్రపంచ కథానికల పోటీలో ఉత్తమోత్తమైన అయిదు కథలలో ఒకటిగా వీరికథ ఎంచబడింది. దీనితో తెలుగు కథా సాహిత్యానికి ప్రపంచ సాహిత్యంలో ఒక స్థానం ఏర్పడుతున్నది. కథకులను అభినందిస్తూ, ఈసందర్భాన్ని పురస్కరించుకుని బహుమతి పొందిన కథను 1951 మే 12 వ తేదీ ఆంధ్రపత్రిక నుండి పునరుద్ధరిస్తున్నాం.

---

మబ్బు మసగ్గా అలుముకుపోయింది. రైలు చాలా ఆలస్యంగావచ్చింది. రావుగారు రెండోతరగతి పెట్టె ఎక్కుతుంటే, ఆయనకు తన యిల్లు, ఆ యింట్లో అలవాటుపడ్డ సుఖాలు అన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆయన చదువుకునే గది అతి శుభ్రంగా తుడిచివుంది. అందులో నల్ల విరుగుడు చేవతో చేసిన రాతబల్ల, దాని మీద ఒక మూలగా ఆకుపచ్చ గొట్టంలో దీపం వెలుగుతూ వుంటుంది. ఆయన కుర్చీ మెత్తలో కూర్చునేచోట అనుకూలమయిన పల్లాలు ఏర్పడ్డాయి. సోఫాలో వున్నట్టు కూడా తెలియకుండా ఆయన భార్య కూర్చునివుంటుంది. ఆయనకు నలుగురు పిల్లలు. ఇద్దరు ఆడ, యిద్దరు మగ. వాళ్లని చూస్తే ఆయనకు ఎంతో గర్వం.

రైలుపెట్టెలో మూడు మెత్తలూ ఎవరో ఆక్రమించుకుని పరుపులు పరుచుకున్నారు. తను ఎక్కినందుకు అందులో వున్న నలుగురు ప్రయాణీకులు చిరాకు పడుతున్నట్టు, రావుగారు వాళ్ల ముఖాలు చూడకుండానే గ్రహించారు. ఇంకో పెట్టెలోకి వెడితే బాగుంటుందని ఆయనకు అనిపించింది. కాని కూలివాడు ఆయన బెడ్డింగూ, పెట్టె, గొడుగు పైబల్లమీద పెట్టి వెళ్లిపోయాడు. ఇంతలో రైలు కదిలిపోయింది. ఒక పెద్ద మనిషి పరుపు కొంచెం మడిచి రావుగారికి చోటుచేశాడు. రావుగారు కూర్చుని పరిసరాలు వీక్షించడం ప్రారంభించారు.

నలుగురూ దూరప్రయాణీకులని ఆయన గ్రహించాడు. బూట్లు, మేజోళ్ళతో సహా బల్లలక్రిందకు తోసివేయబడి వున్నాయి. కోట్లు, పాంట్లు, చొక్కాలు పైకొంకెలకు తగిలించివున్నాయి. వదులయిన పైజామాలను ముగ్గురు మగప్రయాణీకులు తొడుక్కున్నారు. వస్తువులన్నీ యిటూ అటూ తొందరలేనట్టు పరిచి ఉన్నాయి. కిటికీల పక్కనివున్న రెండు మెత్తలమీదా ఇద్దరు పెద్ద వయసువాళ్లు కూచున్నారు. లోపలగా వుంటే నిడుపైన బల్ల మీద ఒక యువకుడు, ఒక యువతీ కూర్చునివున్నారు. యువతి ఆ యువకుని భార్య అయివుంటుంది. సిగరెట్టు పొగ మెల్లని సూటు రావుగారి నాసికారంధ్రాలలోకి తెలియకుండా ప్రవేశించి ఒక క్షణంపాటు ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

రైలుపెట్టెలో సిగరెట్టు పొగనుగురించి రావుగారికి తీవ్రమయిన అభిప్రాయాలున్నాయి. అనేక విషయాలనుగురించి ఆయనకు తీవ్రమయిన అభిప్రాయాలున్నాయి. అసలు ఆయన వేదాంతి. ఆయన కొకఅభిమాన సిద్ధాంతముంది — వేదాంతం జీవితంతోటీ, జీవన విధానంతోటీ, వ్యక్తికీ సంఘానికీ మధ్య ఏర్పడే రకరకాల సమస్యలతోటీ అనుబంధించి వుంటుందని ఆయన వాదము. ఆయన ప్రకారం, వేదాంతానికి మరణానికి నిశితమైన మానవానుభవాలకికూడా అతీతమయిన విషయాలతో గాని ఏమీ సంబంధంలేదు. ఆయన జీవితం సుఖంగా మిట్టపల్లాలు లేకుండా గడిచిపోయింది. అసంతృప్తివల్ల ఆయన జీవితాన్నిగురించి అమితమయిన ఉత్సాహంతోటీ పవిత్రమైన ఉద్రేకంతోటీ మాట్లాడగలరు. ఒక్క వేదాంతిగానే గాకుండా, మంచి వక్తగా కూడా ఆయన ప్రఖ్యాతి పొందాడు. ఆయన తన వేదాంతాన్ని అనుపమానంగా ఉద్విగ్నుడై ఆయన వివరిస్తూవుంటాడు. అసలు ఈ ప్రయాణంచేస్తున్నది ఒక ఉపన్యాసం యివ్వడంకోసం. 'ఆస్తిక మహాసమాజము' అని పేరుపెట్టుకున్న ఒక సంస్థ ఆహ్వానం మీద కూడా ఆయన వెడుతున్నారు. ఉపన్యాసం: సామ్యవాదమూ ఈశ్వరసాక్షాత్కారమూ అనే విషయాన్నిగురించి. ఆయన అభిప్రాయం సామ్యవాదంలో ఈశ్వరసాక్షాత్కారముందనో లేక ఆ రెండూ పరస్పరవిరుద్ధమయినవి కావడంచేత వాటికి ఒక సమన్వయం కల్పించాలనో తెలుసుకోవాలంటే ఆయన ఉపన్యాసం వినవలసిందే.

రావుగారు యువదంపతుల వేపు చూచారు. యువతిముఖం చాలా బరువుగా వుంది. ఆమెకు కాస్త వుత్సాహం కలగడానికి కాబోలు యువకుడు నవ్వుతూ ఆమె చెవిలో ఏదో అన్నాడు. బహుశా తన భర్తతో కూడా ఏదో అతను ఉద్యోగంలో వున్న దూరదేశానికి మొదటిసారి ఆమె వెడుతున్నట్లున్నది. రావుగారికి ఈ మధ్యనే తాను యిచ్చిన ఉపన్యాసం జ్ఞాపకం వచ్చింది. "సత్యము—తత్వము. ఆయన ఉపన్యాసాల శీర్షికలు శబ్దాలంకారాలనుబట్టి నిర్ణయమవుతాయిగాని, అర్థస్ఫురణనుబట్టి కాదనిఆయనస్నేహితులుకొందరు ఆయన్ని వేళాకోళం చేస్తుంటారు. అది నిజంకాదని

ఆయ ననలేదు. కాని ధ్వనినిబట్టి అర్థం అనుసరిస్తోందని మాత్రం సమాధానం చెబుతుంటారు. ఆయన ఇచ్చిన ఉపన్యాసాలలో చాలా అందమయినది "ప్రకృతి పరిష్కృతి."

గాలి పెరిగింది. బలంగా కిటికీతలుపుల మీద ఒత్తుతోంది. ఉన్నట్టుండి పెట్టెలో చీకటిగా అయిపోయింది, ఎంచేతో. ఇంకా సాయంత్రం అయివుండదు. రావుగారి ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి కనిపించీ కనుపించని దీపపు వెలుగులో ఒక అపరాధపరిశోధకనవలను తదైక్యంతో చదువుతున్నారు చటుక్కుని అతను ముఖం ఎత్తి 'టైము ఎంతఅయివుంటుంది' అని రావుగారి నడిగాడు రావుగారు ఒక క్షణం ఆలోచించారు, ఆయన చేతికి గడియారం ఉన్నా కూడా. "మూడుగంటలు అయివుండవచ్చు" అన్నారు.

"ఎంత చీకటిగా అయిపోయింది!" అన్నాడు పెద్దమనిషి. రావుగారు సమాధానం చెప్పకుండా ఆ పెద్దమనిషి వేపు చూచారు. ఆయనకు రావుగారి వయస్సు వుంటుంది ఏభైఏళ్లమనిషి. ఒక అపరాధ పరిశోధక నవల చదువుతూ ఆనందించటం రావుగారికి వింతగా కన్పించింది. ఎదురుగా కూచున్న ముసలాయన గంభీరంగా చుట్టకాలుస్తూ దాని రుచిని ఆస్వాదిస్తున్నాడు కొందరు మనుష్యుల స్వభావాలే అంతే అనుకున్నాడు రావుగారు. ఎదురుగా కూర్చున్న ముసలాయన రావుగారికంటె పెద్దవాడయియుంటాడు. కాని ఆయన ముఖంలో కుర్రవాళ్ళకి సహజమైన చురుకు ఉంది అయినా ఆ ముఖం ఆయన వయసును మాటుపరచడంలేదు. జారిపోయిన దవడలు, ముడతలుపడ్డ నుదురు, వయస్సును చాటుతూనే ఉన్నాయి రావుగారికి ఉపన్యాసానికి ఇంకొకవిషయం స్ఫురించింది. 'వయోవిపాకము. మనోవివేకము'

తాను చాలా అదృష్టవంతుడని రావుగారికి గర్వం. ఆయన జుట్టు ఒత్తుగా నల్లగా ఉంటుంది. ఆయన భార్య ఆయనకంటె పెద్దదిలా కన్పిస్తుంది తెలియనివారు ఆమె ఆయన అప్పగారో, తల్లో అని భ్రమపడుతూ ఉంటారని ఆయన తరుచుగా వేళాకోళం ఆడుతుంటారు ఆయనకొక ఇరవయ్యేళ్ల కొడుకున్నాడనీ, ఆకొడుక్కి అప్పుడే యిద్దరుచక్కని పిల్లలున్నారనీ, అతను యీ మధ్యనే తండ్రిగారి న్యాయవాదవృత్తి వంతనీ తనే చూసుకోడం ప్రారంభించాడనీ, రావుగారిని చూసిన వాళ్లెవరూ అనుకోరు. ఆయనంత అర్జనవున్న వాళ్లెవరూ న్యాయవాదవృత్తినుండి విరమించలేదు. ఆయన తన జీవితంలో కొన్ని నియమాలను పాటించాలని నిశ్చయించుకున్నాడు. వాటిని అతిక్రమించకుండా వుండగల సాహసం ఆయనకు వుంది. నీతి, నియమాలనుగురించి ఆయనకు పిచ్చ పట్టుదలలేదు. కాని మనిషి నడవడిని దిద్దడానికి కొన్ని నియమాలు ఉండి తీరాలని ఆయన అభిప్రాయం ఆయన పిల్లలను నెలకో సారి సినిమాలకు వెళ్లనిచ్చేవాడు అంతకంటె తరుచుగా మాత్రం ఎన్నడూ వెళ్లనివ్వలేదు కుర్రవాళ్ల హృదయాల్లో వుండే కోరికలఎడల ఆయనకు సానుభూతివుండి ఆ కోరికలు తీరవలెంకూడా, వాళ్ళహృదయ పరిపక్వానికి అవసరమని ఆయన అభిప్రాయము. అయినా కోరికలు వాళ్ళ ఆత్మను బంధించేటంతబలంగా వుండకూడదని ఆయన అభిప్రాయం. ఆయన యింట్లో తుచ తప్పని క్రమపద్ధతి చాలా శ్రమపడి అమలులో పెట్టాడు ఆ క్రమపద్ధతి ఆయన మనస్సుకీ శరీరానికీకూడా ఎంతో శాంతీ, సుఖం సమకూరుస్తోంది.

అన్ని కిటికీల తలుపులూ మూసివేసి వున్నాయి గాలి అవతల అరుస్తోంది జల్లుకూడా ప్రారంభించింది. వాన చినుకులు గాలిబలంవల్ల కిటికీ తలుపులసందుల్లోనుంచి చొచ్చుకునివస్తున్నాయి. స్వర్శకు అన్నీ చల్లగా వున్నాయి. యువకుడు యువతికి కొంచెం దగ్గరగా జరగబోయాడు. యువతి ఇటూ అటూ చూచి దూరంగా జరిగింది.

'దారుణంగా వుందే ఈ గాలివాన!' అన్నాడు యువకుడు. రావుగారి పక్కనున్న పెద్దమనిషి ముఖం పైకెత్తి, ఏదో చెప్పబోయి, మానివేసి మళ్లీ చదువు ప్రారంభించాడు.

యువకుడు సిగరెట్టు ముట్టించాడు. యువతి ముఖం చిట్లించి దూరంగా జరిగింది. యువకుడు ఒక చిరునవ్వు నవ్వి సిగరెట్టు కాలుస్తూనే కూర్చున్నాడు. చక్కగా దువ్విన యువతి తలకట్టులోనించి ముంగురులు విడిపోయి ఆమె నుదురుమీద, చెక్కుల మీద కదులుతున్నాయి. తన కుమార్తెలు తల దువ్వుకునే పద్ధతి రావుగారు నిర్ణయించారు ఆ సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చింది వాళ్ల అలవాట్లు, నోములు, వ్రతాలు, స్నేహాలు, దుస్తులు వేసుకునే పద్ధతి అన్నీ కూడా అందాన్ని గురించీ మర్యాదను గురించీ రావుగారి కున్న అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయమైపోయాయి

ఎదురుగా కూర్చున్న ముసలాయన తన పరుపుచుట్టలోనుంచి బూడిదరంగు ఫ్లానలు చొక్కా తీసి తొడుక్కున్నాడు. ఆయన ఆ చొక్కాలోను ఆ చారల పైజమాలోనూ నిజంగా చిత్రంగా కనబడుతున్నాడు. ఆయన ఫ్లాస్కులోనించి వేడి కాఫీ ఒక కప్పు పోసుకుని తాగడం ప్రారంభించాడు. రావుగారికి తన పెట్టెలో ఒవల్టీన్‌తో వున్న ఫ్లాస్కు జ్ఞాపకం వచ్చింది. అది తీసి ఒవల్టీన్ అయన ఆప్యాయంగా చప్పరించడం ప్రారంభించాడు. రావుగారికి ఒవల్టీన్ అంటే చాలా యిష్టం. కాని ఆ యిష్టానికి హద్దుమించి ఆయన ఎన్నడూ వశుడైపోలేదు. ఆ మధురమైన పానీయాన్ని ఆయన రోజుకి రెండుసార్లు,

(18-వ పేజీచూడండి)




21,000 టాన్సిల్సు కేసులకు పైగా టాన్సినాల్ మందులచే ఆపరేషన్ లేకయే గ్యారంటీగా కుదిర్చిరి. సమస్త గొంతువ్యాధులకు మంచిమందు. పత్యం లేదు 40రోజులకు 9-0-0 20 రోజులకు 5-0-0.

నాస్ట్రినాల్:-ముక్కులో కండలు పెరుగుట, వాసన తెలియకుండుట, తలనొప్పి వీటిని ఆపరేషన్ లేకుండా కుదుర్చును. పెద్దబుడ్డి 4-8-0; చిన్నబుడ్డి 2 8-0 అన్ని మందులషాపుల్లో దొరకును. ఆర్డరుతో ¼ సొమ్ము అడ్వాన్సు పంపాలి. గొంతు, ముక్కు, చెవి వ్యాధులకు టాన్సిల్సు & వైటాలిటీ స్పెషలిస్టు డాక్టర్ అప్పారావుగారి సలహా పొందండి.

టాన్సినాల్ లేబరేటరీ (A. W) 53 గోవిందప్పనాయకన్ వీధి, మద్రాసు 1.

# గాలివాన

(7-వ పేజీ తరువాయి)

ఒక్కొక్క కప్ప చొప్పున తాగుతాడు.

గాలి అంతకంతకు భయంకరంగా వీస్తోంది. పెద్ద చినుకులు హోరుగా రైలు పెట్టెమీద మొత్తుతున్నాయి. ఆ హోరులో రైలు నడిచే చప్పుడు కూడా మాటుపడిపోయింది. రైలు కదులుతున్నట్టు రావుగారికి ఒక్క కుదుపువల్ల తప్ప తెలియడంలేదు.

'తుపానులా వుంది' అన్నాడు యువకుడు భార్యతో. ఆమె సమాధానం చెప్పకుండా ఒక రగ్గు దగ్గరగా కప్పుకుంది. ఆమె ముఖంలో పెద్ద బెంగ ఏదో ప్రతిఫలిస్తోంది. గాలివానను గురించి రావుగారి మనసులో అదురు ప్రారంభమయింది.

పెట్టె తలుపు తెరుచుకుంది. ఒక్కసారి పెద్దగా గాలివానా పెట్టెలోకి చొచ్చుకు వచ్చాయి. చినిగిపోయి తడిసిపోయిన గుడ్డలతో ఒక ఆమె పెట్టెలో ప్రవేశించింది. లోపల వున్నవారు చెప్పే అభ్యంతరాలు లక్ష్యపెట్టకుండా తలుపుమూసి ఒకమూల నీరు కారుతూ ఆమె నిలబడ్డింది. ముసలాయన తగినంత కోపం తెప్పించుకుని 'ఇది పరువులపెట్టె అని తెలియదూ' అన్నాడు.

'బాబ్బాబు! తాతగారు! ముష్టిముండకి కొంత నిలబట్టానికి చోటివ్వరా బాబుగారూ. దయగల బాబులు! బిడ్డలున్నా తండ్రులు! ముష్టిముండకి మీ కానీ పారెయ్యండి బాబు. ఆకలి కడుపులో సిచ్చెడుతంది బాబులు. గొప్పగొప్ప బాబులు. డబ్బున్నా బాబులు. గొప్ప పెభువులే అంతాను. పేదముండని ఇల్లా ఆకలితో సచ్చిపోనివ్వరు బాబులు...'

రావుగారు ఆమెవేపు చూశారు. ఆమె కళ్లలో తమాషాగా మెరిసే ఒక తళుకుంది. ఆ తళుకు రావుగారి హృదయంలో ప్రయోజనంలేని విరోధభావాన్ని కల్పించింది. ఆమె వయస్సు షుమారు ముప్పయి ఏళ్లుంటాయి. అంత కడుపునిండా తిని ఉండి కొవ్వెక్కినట్టు ఆమె లేకపోయినా, ఆకలితో చచ్చిపోతున్నట్టు మాత్రం ఆమె కన్పించడం లేదు. ఎంత అసహాయత ఆమె నటించినా, ఆమెలో స్థైర్యం ఉంది.

బిచ్చమెత్తుకోడంమీద రావుగారికి అసలు సానుభూతి లేదు. పేదవాళ్ళున్నా, లేమివల్ల బాధపడుతున్నవాళ్ళున్నా, రావుగారికి జాలిలేకపోలేదు. కాని బిచ్చమెత్తడం తప్పని ఆయన నిశ్చితాభిప్రాయం. ఆ అమ్మ ఆయన దగ్గరగా వచ్చి బిచ్చం అడిగితే ఆయన ఇంక అనుమానం లేనంత గట్టిగా 'ఫో' అన్నారు. ఆమె ముఖం అదో మోస్తరుగా పెట్టి రెండో పక్కకు తిరిగింది. ఎదురుగా కూర్చున్న ముసలాయన దగ్గరకు వెళ్ళి వంగి పాదాలు ముట్టుకుంది. ముసలాయన కాళ్లు వెనక్కిలాక్కున్నాడు వెకిలిగా నవ్వుతూ.

'వెళ్లు, వెళ్లు' అన్నాడు ముసలాయన.

'అల్లా అనకండి తాతగారు. ఆ బాబంత రాతిగుండె కాదు బాబు నీది. ఆ బాబుగారికి యింతమాత్రం జాలిలేదు. ఆకలితో సచ్చిపోతున్న ముండని ముష్టడిగితే 'ఫో' అంటాడు బాబు.'

తను అన్న 'ఫో' ఆమె అనుకరించడం పెద్ద పొగరుబోతుతనమని రావుగారికి అనిపించింది. కాని ఆయనకు ఏమనడానికీ తోచలేదు. ఇష్టంలేకపోయినా ఆమెవేపు చూస్తూ ఆయన అల్లాగే కూర్చున్నాడు. ముసలాయన చిత్రమయిన అవస్థలో పడ్డాడు. దానికి ఓ డబ్బుయిచ్చి పంపేస్తే పెట్టెలో నలుగురూ పైకేమీ అనకపోయినా హర్షించరని ఆయన అనుమానం. ఇవ్వకపోతే ఆ ముష్టిది నోరు ఎలా జారవిడుస్తుందోనని భయం. ఇందులో ఏది ఉత్తమమో ఆయనకు తేలలేదు. చివరకి లేని తీవ్రత తెచ్చిపెట్టుకుని ఆమెను పొమ్మన్నాడు. ముష్టిది గోల ప్రారంభించింది.

'ఇందులో డబ్బున్నా కొరలున్నాతని, నాబోటి ముష్టిముండని ఆకలితో సచ్చిపోనివ్వరని ఎంతో ఆశగా ఈ పెట్టులో కొచ్చాన్రా దేముడ! ఈరోజు తిండికి సరిపడా అడుక్కుందామనుకున్నాను. ఎంత మోసమయిపోయిందిరా దేముడా! మూడోకలాసు పెట్టెల్లో పేదోళ్లుంటారు. ఆళ్ళకి ఎక్కువజాలి ఈబాబులకంటె. నా కట్టమంతా ఆళ్ళకి అర్దమవుద్ది. డబ్బున్నాబాబులంతా రాతిగుండెలని తెలుసుకోలేక పోయాన్రా దేముడా! అవతల గాలివాన. రైలు నడుత్తావుంది. ఇక్కణ్ణించీ ఎల్లా పోను-ఆ దయ\లబాబులున్నా సోటికి. ఇక్కణ్ణించి ఎల్లాపోను...'

ముష్టిమనిషి అందరి దృష్టినీ ఆకర్షించింది. రావుగారిపక్కనున్న పెద్దమనిషి అపరాధపరిశోధకనవల చదవడం ఆపేశాడు. విచిత్రంగా ఆమెవేపు చూశాడు.

'ఉనది ఏమి ఊరు,' అని తమిళుల తెలుగులో అడిగాడు. 'ఓ వూరేటి. ఓ పల్లేటి బాబు మాబోటి పేదోళ్ళకి. తమబోటి పెభువులకి సెప్పకో నాకి వూళ్ళుంటాయి. పెద్ద పెద్ద లోగిల్లుంటాయి మీకు. గేటుముందు బంట్రోతులు కూచోని ముష్టోళ్ళని రానీకుండా తరిమేయిత్తారు. బాబులు. నాబోటి పేదముండకో వూరేటి? ఓ పల్లేటి?'

'నాలుక చాలావాడి' అన్నాడాయన రావుగారిని వుద్దేశించి, ఇంగ్లీషులో.

'ఇంగిలీసులో ఎందుకు బాబు తిడతావు, నాకా బాసొచ్చునా ఏమన్నానా? ఏమీ తెలియనిముండని, పేదముండని.'

బయట చీకటిగా అయిపోయింది. చీకటి పడుతున్న కొద్దీ గాలి మరీ బలంగా వీస్తోంది. రైలు వానపాములా పాకుతోంది. రావుగారు దిగవలసిన స్టేషను దగ్గర పడుతోంది. ఆస్తికసమాజంసభ్యులు ఎవరన్నా స్టేషనుకి రాకపోతారా అని రావు

రు 1000 బహుమానం

లెప్పర్ క్యూర్

(రిజిష్టర్డు)

కుష్టు, బొల్లి, సుఖరోగాదులకు
గ్యారంటీ చికిత్స.

అన్ని భాషలలోను కేటలాగు ఉచితం.

లక్ష్మి అండ్ కో

(రిజిష్టర్డు)

H. O. వాల్తేరు, ఆర్. యస్.

బ్రాంచీలు:

2/135 బ్రాడ్వే, మదరాసు.
గాంధినగర్, విజయవాడ.
కటక్, సికింద్రాబాదు,
రాజమండ్రి etc.

ఒక గంటలో యౌవ్వనము

కామ స్తంభన

ధాతుపుష్టి. సంసారసుఖము ఇచ్చుటలో సాటిలేనిది. విరాళచెందిన వృద్ధులయందు శక్తి, ఉత్సాహము ఇచ్చును రు. 2-8-0

మదన మంజరి ఫార్మసీ

184, బైనా బజారురోడ్డు, మద్రాసు
బెజవాడ—శ్రీనివాస మెడికల్ [illegible] పార్కు రోడ్డు. రాజమండ్రి—ఈశ్వరదాస్ & కో, మెయిన్ రోడ్డు. నెల్లూరు: ఆర్యన్ ఫార్మసీ.

గారు ఆశగా అనుకున్నారు. ఆయనమనస్సు కమకపడుతోంది. తనూ తన సామాలు రైలులోంచి దిగాలి. అదీ ప్రకృత మస్య. సహప్రయాణీకులు సహాయం చేయకపోరు. గాలి అవతల కోపంగావున్న హాసముద్రంలాగ హోరుమంటోంది. ట్లు పడిపోతున్న చప్పుడు లాంటివి నో గోలగా కలిసిపోయి అవతల వినడుతున్నాయి. కదులుతున్న రైలు, గాలికి కారణభూతమయిన మానవమేధ గాలివానలో నిరుపయోగంగాను, త్యల్పంగానూ అనిపించాయి. పెట్టెలో ంత సుఖంగానే వుంది. కాని అందులో ంచి దిగిపోవాలి.

ముష్టిది పెట్టెలో యువదంపతులకు దురుగా మధ్యగా కూర్చుంది. కొంచెం పు ఆగి, మళ్లీ ప్రారంభించింది.

'అమ్మో నా సిట్టితల్లిగారున్నారిక్కడ, ట్టిబాబుగారు కూడా ఉన్నారిక్కడ. ంకేం! సూడేలేదు ఎర్రిముండని. సిట్టితల్లిగారు! సిట్టిబాబుగారితో సొప్పి ఒక్క బ్బు యిప్పించు తల్లి! ఎందుకు తల్లి అల్లా ముగం తిప్పుకుంటావు. ఏం? సిట్టితల్లికీ సిట్టిబాబుకీ సిట్టి తగాదా వొచ్చిందా? సిట్టిబాబుగారు అత్తమానూ సిగరట్లు తాగుతారు. సిట్టితల్లి తాగనీకూడదు. అబ్బో! సిట్టితల్లికి నవ్వొస్తా వుంది.'

యువతి చిరునవ్వు ఆపుకోలేకపోయింది. యువకుడు కడుపునిండా నవ్వాడు. అన్నాడు:

'మాతోకూడా వచ్చేయకూడదూ నువ్వు? పనీపాటా చేస్తూ వుందుగాని తిండీ గుడ్డా యిస్తాం'

'ఏదో యిచ్చి దాన్ని పంపెయ్యకూడదూ?' అంది యువతి భర్తని ఉద్దేశించి.

'నాకు తెలుసు. సిట్టితల్లి గుండె జాలి గుండె. తాతగారు ఇప్పుడు నాకో అణాకి తక్కువ ఇవ్వరు. ఎర్రిముండని ఆ బాబుకంత చిరాకు వచ్చేలాగ సెయ్యకూడదు. తాతగారంత మంచిబాబు ఎక్కడా వుండరు. తాతగారు జాలిగల పెభువు...'

రావుగారు తప్ప తక్కిన అందరూ ఆమెకు ఏదో యిచ్చారు. ఆమె మాటలు వింటుంటే అందరికీ సరదాగా వుంది. కాని రావుగారి మనస్సు ఇతర విషయాలతో నిండిపోయింది. ఆయన గాలివానను గురించీ, తను రైలులోంచి దిగడాన్ని గురించీ ఆలోచిస్తున్నాడు.

రైలు ఆగినట్టు రావుగారికి ఒక ముహూర్తంపాటు తెలియలేదు. సరిగ్గా అప్పుడే గాలివాన మరీ తీవ్రమయింది. ఆయన గొడుగు ఒకచేత్తో పట్టుకు లేచాడు. తలుపు తెరవడంతోటే గాలి ఆయన్ని తీవ్రంగా వెనక్కి నెట్టివేసింది. ఆయన తూలిపోయారు. ముష్టిమనిషి ఆయన సామానులు దింపిపెడతానంది. రావుగారికి ఆ సందర్భంలో మంచిచెడ్డలు ఆలోచించడానికి సావకాశం లేదు. ఆమె సహాయాన్ని అంగీకరించక తప్పలేదు. కాని ఏదో అస్పష్టమయిన నియమాన్ని ఉల్లంఘిస్తున్నట్లు ఆయన మనస్సులో కొంచెం బాధ కలిగింది. కాని రైలు దిగి ఆయన స్టేషనులోకి పరుగెత్తి వెళ్లిపోయారు. ముష్టి ఆమె ఆయనసామానుల బరువుతో తూలుతూ ఆయన వెనకాల వచ్చింది. సామానులు వెయిటింగురూములో పెట్టింది. స్టేషనులో ఎక్కడా ఒక్క దీపం లేదు. రావుగారు కొంత డబ్బుతీసి ఆమెకు యివ్వబోయాడు. ఆమె వద్దనలేదు గాని, ఏదో వినబడకుండా అని చటుక్కుని మాయమయిపోయింది.

స్తబ్ధుడై రావుగారు మళ్ళీ తన గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. గింగురుమనే ఆ గాలిలో కాళ్లు పట్టు తప్పిపోతున్నాయి.





ఈ విధముగా సులభముగా చేయవచ్చును:

ఒక చిన్నెడు సెనగపప్పును రాత్రియంతయు నానబెట్టండి. తరువాత ఈ సెనగపప్పును ఒకపౌను చిన్నచిన్న మాంసపు ముక్కలు, పచ్చి మిరపకాయలు, కొన్ని మిరియపు గింజలు, కొద్దిగా పసుపు, కారపుపొడి, ఉప్పు, దాల్చినచెక్క, లవంగములు మరియు నీళ్ళతో కలిపి ఒక పలుచటి ముద్దగా రుబ్బండి. తరువాత పూర్తిగా ఉడుకబెట్టబడిన గ్రుడ్ల మీద పలచని పొరతో ఈ ముద్దను పూయండి. తరువాత వీటిని కొంచెంవరకు డాల్డాతో వేపండి. తరువాత ఉల్లిపాయ ముక్కలతో తినుట కివ్వండి.

దీనిని తప్పిపోకండి!



ఇంగ్లీషులో క్రొత్తది డాల్డా వంట పుస్తకము — చిత్రములతో కూడినది — ఆర్ట్ పేపర్ — నట్టి పేజీలు — 300 వంట పద్ధతులు — ఆరోగ్యము, పరిశుభ్రత మరియు వంటగృహమును గురించి సూచనలు — ఒక రూపాయి మాత్రమే. తపాలా ఖర్చులు ఎనిమిది అణాలు వేరే.

ది డాల్డా అడ్వైసరీ సర్వీస్
పోస్ట్ బాక్స్ నంబరు 353, బొంబాయి 1

డాల్డాతో
తయారుచేయబడినవి

మీ భోజన పదార్థములు మరియు తీపి పదార్థములు దాల వాసనగాను, రుచికరముగాను ఉండేటందుకు వాటిని డాల్డాతో తయారుచేయండి. డాల్డా శుద్ధమైనది మరియు పుష్టికరమైనది మరియు సీలుచేయబడిన డబ్బాలలో శుభ్రముగాను, క్రొత్తగాను మిమ్మలను చేరును.




సరియైన ఆహారములో మీకు కావలసిన క్రొవ్వుపదార్థమును ఇచ్చును.

HVM. 171-50 TL

గుడ్డలన్నీ తడిసిపోయాయి పెట్టితీసి చేత్తో యిటూ అటూ తడిమాడు. బాటరీలైటు చేతికి తగిలింది. పట్టరాని సంతోషం వచ్చింది రావుగారికి. తన పెట్టెలో ఒక లైటున్నదన్న సంగతి ఆయనకు గుర్తులేదు. తడిబట్టలు విప్పిపొడిబట్టలు కట్టుకున్నాడు. ఊలుస్వెట్టరు తొడుక్కున్నాడు. మఫ్లరు చెవులకు, తలకు చుట్టుకున్నాడు. పెట్టితాళం వెయ్యడం కూడా మరిచిపోయి కుర్చీలో కూర్చున్నాడు. తన స్థితినిగురించి ఆలోచించడం కూడా ఆయనకు యిష్టం లేదు. ఇంతలో రైలు దీపాలు కదిలాయి. స్టేషనులో ఎవరో ఒకరు వుండి తీరాలని నిశ్చయించుకుని బయటికి వచ్చాడు. ఇద్దరు ఎవరో ప్లాట్ ఫారం దాటివెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు. రావుగారు గొంతెత్తి పిలిచారు. ఇద్దరూ ఆగారు. ఒకరు స్టేషను మాష్టరుగారనీ ఇంకొకరు బంట్రోతనీ రావుగారు గుర్తించారు.

‘నేను వూర్లోకి వెళ్లాలి’ అన్నారు రావుగారు ఆదుర్దాగా. ‘చాలా కష్టం. రోడ్డుమీద అంగుళం అంగుళానికీ చెట్లు పడివున్నాయి. టెలిఫోనుతీగలు తెగిపోయాయి. ఒకచోటికి, ఇంకొచోటికి కబురు తెలియడం కూడా అసంభవం. వచ్చే స్టేషనులో రాత్రికి రైలు ఆగిపోతుంది. గాలివాన చాలా తీవ్రంగా వుంటుందనీ, 36 గంటలవరకూ తగ్గదనీ మాకు వార్త వచ్చింది.’

‘కాని స్టేషన్లో యింకెవరూ లేరు.’

‘నేనేం చేస్తాను? ఎల్లాగో స్టేషనులో నే మీరు గడపాలి.’



హిందూ దేశమంతటా దొరకును

స్టేషనుమాష్టరు వెళ్ళిపోయాడు. రావుగారు వెయిటింగురూంలోకి వెళ్ళిపోయారు. పడకకుర్చీలో కూలబడిపోయారు. గదితలుపులు మూసేస్తే గాలివాన లోపలికిరాకుండా వుంటుందని ఆయనకు తోచలేదు. రెండు కిటికీ తలుపులు ముక్కలైపోయాయి. కొన్ని పెంకు లెగిరిపోయాయి. ఏవో క్రూరశక్తులు విజృంభించి మానవుడు నిర్మించినవీ, దేవుడు సృష్టించినవీ కూడా భూమిమీద లేకుండా రూపుమాపడానికి పూనుకున్నట్లు అనిపిస్తోంది. ఈ గందరగోళములో మనస్థైర్యాన్ని చేకూర్చే వేదాంతమేదీ రావుగారికి తోచలేదు. క్రమశిక్షణ, నియమాలు, విలువలు అన్నీ కూడా మానవాతీతమయిన కొన్ని శక్తులు విజృంభించినపుడు అర్థరహితాలయిపోతాయని ఆయనకు జీవితంలో మొదటిసారి అనుభవంలోకి వచ్చింది. ప్రకృతి చెలరేగి సర్వనాశనాని కొడిగట్టినట్లయితే మానవుడు తన్ను తానెలా రక్షించుకోగల్గుతాడు? ఎన్నడూ ఎరుగని భీతి రావుగారి మనస్సును ఆవరించింది. ఆ బాధ దుర్భరంగావుంది. చుట్టుపక్కల ఎక్కడా మానవహృదయమన్నది లేదు. స్టేషన్ భీతావహంగా వుండి గాలివాన ఉగ్రరూపందాల్చింది. ఆయన మనస్సు ఒకపీడకలలో చిక్కుకున్నట్టు ఉక్కిరిబిక్కిరైపోయింది. ఆ గదిలో యింకొకవస్తువేదో వున్నట్టు రావుగారికి కనిపించింది, తెరచిన తలుపులోనుంచి లోపలికేదో ప్రవేశించినట్టుగా. చేతిలో దీపం వెలిగించి ఆయన ఆవేపు చూశాడు. ముష్టి ఆమె గజగజ వణకుతూ నీరుకారుతూ వొకమూల నిలబడివుంది. ఆమె తడివెంట్రుకలుముఖాన్నీ చెక్కులనీ అంటుకున్నాయి. వాటివెంట నీరుకారుతోంది.

‘బాబుగారు! తలుపు ముయ్యలేదే! కొంచెం వెచ్చగా వుంటుంది’ అంది ఆమె గొంతుక బాగాపెద్దది చేసి. ఆయన ఒక యంత్రంలాగా లేచి తలుపు ముయ్యడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆమె సహాయం చేసింది. ఎలాగో తలుపు మూసి లోపల గడియవేశారు. కాని గాలి ఒక్కసారి వూపింది. గడియ వూడిపోయింది. ఇద్దరూ మళ్ళీతలుపులు మూసి గదిలో వున్న కర్రసామాను అంతా కొన్నికుర్చీలూ, ఒక బీరువ, బరువైన డ్రాయరూ తలుపుకి అడ్డంగా చేర్చారు. తలుపులుముయ్యాలని తనకు తోచకపోవడం రావుగారికి వింతగా తోచింది. ఇపుడు కొంత వెచ్చగా వుంది. భయం తగ్గింది. ఎక్కడో పెద్ద చప్పుడైంది. ఏదో పడిపోయింది. స్టేషన్ లోపలే పడిపోయిందేమో? “ఏం గాలివానండి బాబుగారు నేను పుట్టినప్పటినుండి యింత గాలివాన నేను చూడలేదు” అంది ముష్టి ఆమె. ఆమె గొంతులో ఏమీ బెదురు లేదు. అంత ప్రశాంతంగా ఆమె ఎట్లా మాట్లాడకల్గుతూందో ఆయనకు అర్థం కాలేదు. ఆమెవేపు దీపంవేసి చూశాడు. మూలగా చలిచేత ముడిచిపెట్టుకుని వొణుకుతూ ఆమె కూచున్నది రావుగారు పెట్టి తీసి తన పంచ ఒకటి తీసి ఆమె వేపు విసరి ‘తడిబట్ట విడిచి యిది కట్టుకో’ అన్నారు. ఆయ నన్న దేమీ ఆమెకు వినిపించలేదు గాని పొడిబట్టయిచ్చినందుకు కృతజ్ఞత చూపిస్తూ బట్ట మార్చుకుంది. ఆ మూలే పొడిగా వున్న చోట కూర్చుంది.

రావుగారికి తనకు ఆకలి వేస్తున్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఆయన పెట్టె తీసి అందులోవున్న బిస్కట్లపొట్లం తీశాడు. ఒకటొకటి చొప్పునా నమలడం ప్రారంభించాడు. ఆ మూల కూర్చున్న ఆమె ముఖంవేపు చూశాడు. ఆమెకుకూడా ఆకలి వేస్తున్నదేమో నని ఆయనకు స్ఫురించింది. బిస్కట్లు తింటావా’ అని అడిగాడు. ‘ఏమన్నారు?’ అన్నదామె గట్టిగా. ఆ గాలిహోరులో ఒకరు మాట్లాడితే ఒకరికి వినిపించలేదు. ఆయన దగ్గరగా వచ్చి కొన్ని బిస్కట్లిచ్చాడు. ఇవే వున్నాయి తినడానికి అన్నారు రావుగారు ఏదో పొరబాటు చేసినట్లుగా. కాని అసలు లేనిదానికంటె నయం కాదూ? తనచోటికి తిరిగి వెళ్లి పెట్టెమీద కూచున్నారు కుర్చీలు తలుపులకి అడ్డం పెట్టి వున్నాయి. ఆమె గదిలో వుండడంవల్ల కొంచెం ధైర్యం వచ్చింది. ఎవరూ లేకపోవడంకంటె ఆమె వుండడం కొంత నయం. ఆమె దేన్నికూర్చీ బాధపడదు గాలివానను గురించి కూడా. జీవితంలో కష్టనిష్ఠురాలు బాగా ఆమెకు అనుభవమై వుంటాయి. అంచేత ఆమె ఏ పరిస్థితినైనా కంగారు పడకుండా ఎదుర్కొగలదు. రావుగారు గడియారం వంక చూచారు. అపుడే తొమ్మిదిగంటలయింది. అయినా రైలు దిగినతర్వాత కొన్ని యుగాలు గడిచినట్లు ఆయన కనిపించింది. ఆయన వచ్చే స్టేషనువరకు మిగతావారితో కూడా ప్రయాణం సాగించివుంటే బాగుండును. పెద్ద గాలివాన చెలరేగుతుందనీ, తను దిగేది ఒక చిన్న స్టేషన్ అనీ ఆ కంగారులో ఆయనకు స్ఫురించలేదు. స్టేషన్‌నుంచి వూరు సుమారు రెండు మైళ్ళు ఉంటుంది. వూరికితర్వాత స్టేషన్ నుంచి అయినా చేరుకునివుండవచ్చు. అన్ని విషయాలను కొన్ని సూత్రాలలో బంధించడం అలవాటయిన ఆయన మనస్సు

గాలియొక్క వేగాన్ని గురించి యోచించింది. బహుశా గంటకు 80/- లేక 100/- మైళ్ళు వుండవచ్చు గాలివేగం. పెద్ద భయం ఆయన మనసును ఆవరించింది. ఈ గది కూలిపోవచ్చు. బయటికి పోయే ఒక్క దారీ కుర్చీలతోటీ, బల్లలతోటీ మూసి వుంది. ముష్టిమనిషి కూచున్న చోటికి ఆయన కంగారుగా పరుగెత్తారు. 'ఈ యిల్లు కూలిపోదుగదా?' అని ఆయన అడిగారు.

'ఎవరు చెప్పగలరు? యిల్లు గట్టిగానే వున్నట్టుంది. గాలిబలం ఎక్కువయితే ఏది ఆగుద్ది?'

ఆమె మాటల్లో ధైర్యాన్ని కలిగించేది ఏదీ లేకపోయినా, ఆమె గొంతులో ఏదో ఒక చనువూ స్థైర్యం ధ్వనించింది.

ఆయన పెట్టెదగ్గరకు పోయి కూర్చున్నాడు. ఆయన కూర్చున్న మూలకు నెమ్మదిగా ఆమె కూడా చేరింది. అక్కడ కూచుంటే ఒకరిమాట ఒకరికి వినబడదు అంది.

'గాలివాన యింత ముదిరిపోతుందని నేననుకోలేదు.'

'బాబుగారు ఎందుకలా భయపడతారం' దామె. 'ఒక్కరుంటేకంటె యిద్దరమున్నాంగదా! టిక్కట్టుకలెక్టరు దొంగముండావాడు. రైలు కదులుతూంటే నన్ను దింపేశాడు, ఏం చేయను! యిక్కడుండిపోయాను. అయినా నాకేటి విసారం? బాబుగారు చుట్టు పెట్టుకోనాకి ఓ పాడిగుడ్డ యిచ్చారు. ఏదో కొంత ఆకలికి మేత పడేశారు. వచ్చే సేసనులో ఈమాత్రం సుకమయినా వుంటాదని ఎలా అనుకోగలను? వున్నంతలో సుకంగా వుండాలి బాబుగారు! అది లేదనీ, యిది లేదనీ సీకాకుపడితే ఏం లాబం?'

ఆమె గొంతు అలా మోగుతుంటే ఆయన మనస్సు కాస్త స్థిమితపడింది. ఆమె భౌతిక దేహాన్ని చూస్తే ఆయన కసహ్యం. ఆయన మనస్సుకీ ఆమె మనస్సుకీ ఎంతో అంతరం వుంది. అయినా ఆ భయంకరమయిన రాత్రివేళ తనకు తోడుగా ఆమె వున్నందుకు కృతజ్ఞత ఆయన మనసులో నిండింది.

'నీ కెవరూ చుట్టాలు లేరా?' అన్నారాయన. వెంటనే యింత చనువుగా ప్రశ్న వేసినందుకు నొచ్చుకున్నారు. తను రైలులో ఆమెకు ఒక కానీ కూడా యివ్వనందుకు ఆమెకు తనమీద ఏమన్నా కోపముం దేమోనని ఆయన అనుమానం. కాని ఆమె మాటల్లోగానీ చేతల్లోగానీ కోపం కనబడలేదు. గట్టిగా గొంతు ఎత్తి మాట్లాడవలసిన అవసరం లేకుండా ఆమె కొంచెం ఆయనదగ్గరగా జరిగింది.

'సుట్టా లందరికీ వుంటారు. ఏం లాబం బాబుగారు? మా అయ్య తాగుతాడు. ఆడే మా అమ్మని సంపేశాడంటారు. నాకు మనువు అవలేదు. కానీండి బాబుగారు ఓ దొంగముండావాడితో సేవితం కలిగింది. నాకు ఇద్దరు పిల్లలండి బాబుగారు. ఆడికి జూదం, తాగుడు అలవాటయిపోయాయండి. రోజా విలకివిలు నెగ్గుతుంటాడు. పోతుంటాయి ఏం చేయను బాబుగారు? ఇంట్లో తిండికీ తిప్పలకీ నా సంపాదనే. పిల్లలింకా చిన్నోళ్లు బిచ్చమెత్తుకోనాకి. మావోడికి రోజుకో పావలా ఇత్తానండి తాగుడికి. ఆడికి నన్ను సూత్తే అడలు బాబుగారు. తాగుడు లేకపోతే నా ఎదురుగా నిలబడి తట్టుకోలేడండి. అందుకే తాగుతాడు బాబుగారు! అసలు అందరికీ తాగుడు అలాగ అలవాటవుద్దండి.'

'నువ్వు ఏమాత్రం సంపాదిస్తావు?'

'ఒక్కొక్కరోజు ఐదు రూపాయలు దాకా దొరుకుద్ది. ఒకొకరోజు కానీ కూడా వుండదు. అయినా బాబుగారు! కనపడితే ఎవరూ లేదనరండీ మీరు తప్పితే. కొంతసేపు ఆరితో సరదాగా మాట్లాడితే యిచ్చేత్తారండి.'

రావుగారు అనుకోకుండానే ఆమె ముఖంమీదికి దీపం వేశారు. ఆమె కొంచెంగా నవ్వింది. ఎవరినైనా సరే ఆమె కిందా మీదా పెట్టేయగలదు. అయినా ఆమెకు మనస్సులో అంత లోతుగా యిష్టాలు అయిష్టాలు లేనట్టు ఆయనకు అనిపించింది. జరుగుతున్న ఆక్షణంలోనే ఆమెకు సజీవమయిన అనుబంధం, గడచిన కాలపు స్మృతులబరువుగానీ, రాబోయే రోజుల గూర్చిన ఆశలుగానీ ఆమెకు లేవు. ఆమె నడవడిని నిర్ణయించే సూత్రాలా లేవు. ఆ సూత్రాలలో నిషేధాలసలే లేవు. నిత్యమూ ధర్మాధర్మచింతతో బాధపడే అంతరాత్మగానీ, నాగరికులకు సహజమయిన సంకీర్ణ మనస్తత్వంగానీ ఆమెకు లేవు. తను ఎన్నడూ ఎరగని మగవాడికూడా ఆమె శరీరాన్ని అర్పించి తేలికైన మనస్సుతో ఆమె సుఖించగలదు. ఆయన ఆమె కొంటె చిరునవ్వుని యింకా అలానే చూస్తూ కూచున్నారు. 'ఏటండి బాబుగారు! నాకే సలా చూత్తారు?' అంది ఆమె. 'మునుపున్నంత రంగుగా యిపుడు లేనండి.'

వెంటనే ఆయన తనలోకి ముడుచుకుపోయారు. తన మనస్సులో అశ్లీలమయిన భావాలు వుంటాయన్నట్లు ఆమె సూచించినందుకు ఆమెమీద అసహ్యం కలిగింది.

'నీవేపు చూడ్డంలేదు నేను,' అన్నారాయన, గట్టిగా. 'దీపం ఆర్పడం మరచిపోయాను.'

అకస్మాత్తుగా పెద్ద చప్పుడైంది. గది తలుపులు ఒక్కవూపులో తెరుచుకున్నాయి. అడ్డుగా పెట్టిన సామాను చెల్లాచెదరైపోయింది. ఒక తలుపు పూర్తిగా ఊడిపోయి ఒక కుర్చీమీదనుంచి పల్టీకొట్టింది. రావుగారిగుండె గొంతుకలో అడ్డింది. శక్తి కొద్ది ఒక మూలలోకి గెంతి, పిచ్చిగా ఆయన ముష్టిఆమెను కౌగలించుకున్నాడు. వెంటనే తెలివి తెచ్చుకుని చాలా సిగ్గుపడ్డాడు. కాని ఆమె ఆయనచెయ్యిపట్టి నడిపించుకుని వెడితే మాట్లాడకుండా వెళ్లాడు గుమ్మంపక్కనున్న మూలలోకి. ఆమె ఆయనను తీసుకువెళ్లి ఆ మూలలో కూచోబెట్టింది. తను కూడా దగ్గరగా కూర్చుని చేతు లాయన చుట్టూ ముట్టింది. ఆ కౌగిలింతలో సంకోచాలేమీ లేవు. ఆయన మనస్సులో ప్రళయమంతటి మథన జరుగుతోంది. కాని ఆ వెచ్చదనం ఆయనకు ప్రాణావసరం. అంచేత ఆయన కాదనలేదు.

'సరిగ్గా కూకోని నా సుట్టూ సేతు లేసుకోండి. కొంత ఎచ్చగుంటది. పాపం! బాబుగారు ఒణికిపోతున్నారు.'

ఆ మాటలు చాలా వెగటుగా ధ్వనించాయి రావుగారికి. ఆమె మరీ దగ్గరగా జరిగి ఆయన వొళ్లోకి వాలింది. ఆమె రొమ్ములబరువు ఆయన మోకాళ్ళమీద ఆనింది. మోకాళ్లు మరి కాస్త దగ్గరగా ఆయన ముడుచుకుని దీర్ఘంగా అవమానకరమయిన ఆలోచనాపరంపరలో మునిగిపోయాడు. ఆమె అలా మాట్లాడుతూనే వుంది.

'ఈ మూల భయం లేదండి. బాబుగారికి చక్కని కూతుళ్లుంటారు యింటికాడ. బాబుగారు ఆరిని తలుచుకుంటున్నారు. మా గుడిసి ఎగిరిపోయుంటది. మా పిల్లలేమైయుంటారో! ఇరుగు పొరుగోళ్లు సూత్తుంటారెండి. మావోడు వట్టి ఎదవ. ఎందుకూ పనికిరాడు. చిత్తుగా తాగిపడుంటే గుడిసి ఎగిరిపోతే ఆడికేం తెలుత్తాది? పిల్లలు సుకంగా వున్నారో లేదో?'

ఒక మానవహృదయంలోనించి వెలువడిన యీ వేదన వింటుంటే ఆయన హృదయం చుట్టూ పెట్టుకున్న గోడలన్నీ మాయమైపోయాయి. పెద్ద ఆవేదనతో ఆ ముష్టిఆమెను గట్టిగా దగ్గరగా అదుముకున్నాడు. ఆమె ఆవేదన తనకు అర్థమయినట్టు ఆయన మోకాళ్లమీద మెల్లగా తట్టింది. క్రమంగా ఆయన మనస్సు ఆలోచించడం మానివేసింది. గాలిచేసే అంతులేని గోల మనస్సుపొలిమేరల్లోకి పోయింది. ఆయన కాళ్లమీద గుండెలమీద ఆనుకున్న మానవశరీరపు వెచ్చదనం వొక్కటే ఆయనకు గుర్తు వుంది.

కాలం అతిమెల్లగా జరుగుతోంది. కాని ఆ సంగతి ఆయనకు తెలియదు. గాలివాన బలం హెచ్చింది. అన్నిపక్కలనించీ పెద్ద పెద్ద శబ్దాలు వినబడుతున్నై. తెల్లవారేసరికి ఒక్క చెట్టయినా నిలబడివుంటుందా అనిపిస్తోంది. కొంచెంయించుమించుగా పైకప్పు పెంకులన్నీ గాలికి ఎగిరిపోయాయి. కాని గాలివల్ల వాన వారిద్దరినుంచీ దూరంగా రెండో పక్కకి పడుతోంది.

కొంతసేపటికి రావుగారి కాళ్లు తిమ్మిరెక్కాయి. పడుకునివున్న ఆ మూర్తి కదలకుండా మెల్లగా ఆయన కాళ్లు కదుపుకున్నాడు. మెల్లగా మనస్సు తేలికపడింది. లైటువెలిగించి ఆమె ముఖంవంక చూశాడు. నిద్రలో ఆ ముఖం అమాయికంగా, నిశ్చింతగా వుంది. స్వచ్ఛమైన, నిసర్గమయిన ఒక శోభ ఆ ముఖంలో దివ్యత్వం స్ఫురింపచేసింది.

గాలివానజోరు హెచ్చింది. కాని ఆయన మనస్సులో అమితమయిన ప్రశాంతి నిండింది. శరీరం అలసిపోయి విశ్రాంతి కోరింది. క్రమంగా ఆయన పరిసరాలను మరచిపోయి నిద్రలో మునిగిపోయాడు.

ఆయనకు మళ్ళీ మెలకువవచ్చేసరికి వాన తగ్గింది. గాలిమాత్రం బలంగా వీస్తోంది. ముష్టిఆమె లేచి వెళ్లిపోయింది. గడియారంవేపు చూసుకున్నారు. ఐదుగంటలయింది. లేచి నిలబడ్డారు. మోకాళ్లు పట్టివేశాయి. అనుకోకుండానే జేబులుతడుముకున్నారు. ఆయనకు స్ఫురించిన మొదటిమాట, 'దొంగముండ!' కాని ఆమె అల్లా దొంగతనంచేసివుంటుందనుకోడం ఆయనకు యిష్టంలేదు. గదిలో నాల్గుమూలలా వెతికారు. కనబడలేదు. గడిచినరాత్రి కంగారులో ఎక్కడన్నా పడిపోయిందనుకున్నారు. గదిలోనుంచి బయటికి వచ్చారు. బయట దృశ్యం భీభత్సంగా వుంది. ప్లాట్‌ఫారంతప్ప చుట్టుపక్కలంతా నీటిమయం. కొందరు దూరంగా రైలుగట్టువెంబడి నడిచివస్తున్నారు. బహుశా వూళ్ళోనుంచి అయివుంటుంది. కొందరు దెబ్బలుతిన్నవాళ్లు స్టేషను రెండోపక్కన కింద పడుకునివున్నారు. దూరాన్నుంచి చూసి ఆయన మొగంతిప్పుకున్నారు. ఏదోహాస్పిటల్‌లో తెల్లగా శుభ్రంగా వరసల్లో పడుకోబెట్టినప్పుడు తప్ప అంత నగ్నంగా మనిషి బాధపడడం ఆయన ఎప్పుడూ చూడలేదు. ఆయనకు వికారం వచ్చింది, మనస్కు తిరిగాడు.

టిక్కెట్లు అమ్మే గది పూర్తిగా కూలిపోయింది. గదితలుపులు ఎక్కడా కనబడ్డంలేదు. లోపల ఏవో కుర్చీలూ, బల్లలూ చిందరవందరగా పడిపోయివున్నాయి. వెయిటింగురూము కూలిపోతే ఏమైయుండునని ఆయన అనుకున్నాడు. ఆ కల్లోలాన్ని శూన్యంగా చూస్తూ ఆయన నిలబడిపోయాడు.

లోపలి చీకటికి కళ్ళు కాస్త అలవాటుపడ్డాక ఆ సామానుకింద ఏదో శరీరం అస్పష్టంగా అనింది. దీపంవేసి చూశారు. ముష్టియామె.

ఆయన తట్టుకోలేకపోయాడు. వంగి నుదురు తాకి చూశారు. చల్లగా చచ్చిపోయివుంది. చేతులు రెండూ యివతలకు వున్నాయి. క్రింది భాగం పూర్తిగా నలిగిపోయినట్టుంది. ఒక చేతిలో ఆయన పర్సుంది. రెండోచేతిలో కొన్ని నోట్లు, కొంత చిల్లరా వుంది. బహుశా టిక్కెట్లు అమ్మిన డబ్బైవుంటుంది. గుమస్తా ఆ డబ్బు డ్రాయర్లో పెట్టి తొందరగా యింటికి పోయుంటాడు.

రావు అకస్మాత్తుగా చిన్న పిల్లవాడివలె ఏడుపు ప్రారంభించాడు. చల్లని ఆ నుదురు ముద్దుపెట్టుకున్నాడు. గడిచిన రాత్రి ప్రతీ చిన్నవిషయం ఆయనకు మళ్ళీ మళ్ళీ జ్ఞాపకము వచ్చింది. తనకు ఆత్మస్థైర్యాన్నీ శాంతినీ, గాలివానకు తట్టుకోగలశక్తినీ చేకూర్చిన ఆ మూర్తి అక్కడ పడిపోయివుంది. ఆ గాలివానకు ఆమె బలిఅయిపోయింది. ఆయన హృదయం తుపానులో సముద్రం లాగా ఆవేదనతో పొంగిపొరలింది. తనకు జీవితంలో మిగిలిన ఒక్క ఆనందమూ శాశ్వతంగా పోయినట్టు ఆయనకు అనిపించింది. తన పర్సు దొంగిలించినందుకు గాని, అంత గాలివానలో డబ్బేమన్నా దొరికితే తీసుకోవచ్చునని టిక్కెట్ల గదిలోకి వెళ్లినందుకు గాని ఆయన ఆమెను మనస్సులో కూడా దూషించలేదు. ఆమె ఆఖరుతత్వం ఆయనకు తెలుసును. ఇప్పుడు ఆమె చిలిపితనాలు, కొంటెతనాలు ఆయనకు ప్రేమపాత్రాలయాయి. ఆయనలో లోతుగా మాటుపడియున్న మానవతత్వాన్ని ఈ జీవి వికసింపజేసింది. ఆయనభార్య గాని ఆయన పిల్లలలో ఎవరు గానీ ఈమె వచ్చినంత దగ్గరగా రాలేదు. ఆయన విలువలు, నియమాలూ, ధర్మచింతా, వేదాంతం అన్నీ త్యజిస్తా డాయన ఈ వ్యక్తికి ప్రాణం పొయ్యగలిగితే.

అవతల మనుష్యులు వస్తున్న సవ్వడి వినిపించింది. రావుగారు కళ్లు తుడుచుకుని ఒక క్షణం ఆలోచిస్తూ నిలబడ్డారు. తర్వాత ఒక నిశ్చయంతో ఆమె వేళ్ళ సందులోంచి డబ్బు తీసి తెరచియున్న డ్రాయరులోవేసి డ్రాయరు మూశాడు. కాని తనపర్సు ఆమె చేతిలోంచి విడదీయడానికి ఆయనకు మనస్సు ఒప్పలేదు. తనకు సంబంధించినదేదో ఒక చిహ్నంగా ఆమెశరీరంతో ఉండిపోవాలని ఆయనకు అనిపించింది. కాని యితరులు ఆమె దొంగతనం చేసిందని అనుకుంటే ఆయన భరించలేడు. అంచేత జాగ్రత్తగా ఆ పర్సులోనుంచి తన పేరుగల కార్డు తీసివేసి బరువైన హృదయంతో అక్కణ్ణించి వెళ్లిపోయాడు.

★

